లబ్ధిదారులకు డబుల్ బెడ్రూం ఇండ్లు కేటాయించాలి

- బీఆర్ఎస్ రాష్ట్రనాయకుడు కురువ విజయ్‌కుమార్

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు కురువ విజయ్‌కుమార్

గద్వాల, ఫిబ్రవరి 5 : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో నిర్మించిన డబుల్‌బెడ్రూంలు లాటరీ ద్వారా కేటాయించిన లబ్ధిదారులకు వెంటనే స్వాధీనం చేయాలని బీఆర్ఎస్ రాష్ట్రనాయకులు కురువ విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. డిప్ ద్వారా డబుల్ బెడ్రూం ఇండ్లు కేటాయించిన వారికి స్వాధీనం చేయాలని కోరుతూ బుధవారం కలెక్టర్ సంతోష్, అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గద్వాల మున్సిపాలిటీ పరిధిలో 37వార్డులకు సంబంధించి ఇల్లు లేని నిరుపేదల నుంచి దరఖాస్తులు స్వీకరించి అర్హులను ఎంపిక చేశారని అర్హులను ఎంపిక చేసిన తర్వాత డిప్ పద్ధతి ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసి రెండేండ్లు కావస్తున్నా నేటి వరకు లబ్ధిదారులకు ఇండ్ల కేటాయింపు జరగలేదన్నారు. ఇండ్ల కేటాయింపు ఆలస్యం కావడంతో అర్హుల జాబితా నుంచి పేర్లు అధికార పార్టీ నాయకులు గల్లంతు చేస్తున్నారని ఆరోపించారు. లాటరీ పద్ధతి ద్వారా 771మంది లబ్ధిదారులను ఎంపిక చేయగా వారికి ఇప్పటివరకు ఇండ్లు స్వాధీనం చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. అధికార పార్టీ నాయకులు అర్హుల జాబితా నుంచి 90మంది పేర్లను తొలగించినట్లు తమ దృష్టికి వచ్చిందని దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని కలెక్టర్‌ను కోరారు. బీఆర్ఎస్ నుంచి గెలిచిన స్థానిక ఎమ్మెల్యే కాంగ్రెస్‌లోకి వచ్చిన తర్వాత జాబితా తారుమారు చేశారని ఆరోపించారు. లబ్ధిదారుల ఎంపిక జాబితా, ప్రస్తుత జాబితా కలెక్టర్ ఒకసారి పరిశీలించిన తర్వాత అర్హులైన వారికి ఇండ్లు ఇవ్వాలన్నారు. నిజంగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఇండ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించాలని ప్రేమ ఉంటే కొత్తగా ఇండ్లు మంజూరు చేయించాలని అంతే కాని కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిన ఇండ్లనే ఇందిరమ్మ ఇండ్లుగా చెబుతూ పేదల పొట్ట కొడితే పేదల పక్షాన బీఆర్ఎస్ పెద్ద ఎత్తున పోరాటానికి కార్యాచరణ రూపొందించి పేదలకు అండగా ఉంటుందని హెచ్చరించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ప్రతాప్‌రెడ్డి,రాము, తిమ్మప్పగౌడ్, బజారి, రవి, శ్రీకాంత్, నర్సింహులు పాల్గొన్నారు.

పోషక విలువలను పెంపొందించేందుకు మొక్కలు పంపిణీ

నాగర్‌కర్నూల్ జిల్లా చెంచుపెంటలో మొక్కలను అందజేస్తున్న దృశ్యం

పెద్దమందడి, ఫిబ్రవరి 5: నలమల్ల అటవీ ప్రాంతంలో నివసిస్తున్న చెంచుల్లో పోషక విలువలను పెంపొందించేందుకు మొక్కలు పంపిణీ చేసినట్లు కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన కళాశాల మోజర్ల డీన్ డాక్టర్ పిడిగం సైదయ్య అన్నారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లాలోని నలమల్ల అటవీ ప్రాంతంలో ఉన్న అప్పాపూర్, భౌరాపూర్, చెంచుపెంటలో కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం డాక్టర్ డి.రాజిరెడ్డి ఆధ్వర్యంలో పోషక విలువలు గల మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పిడిగం సైదయ్య మాట్లాడుతూ విశ్వవిద్యాలయ ఉప కులపతి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారన్నారు.

గ్రామాల్లోని ఒక్కో ఇంటికీ ఐదు రకాల పండ్ల మొక్కలు దానిమ్మ, అంజీర, కరొండా, పాపాయ, జామ మొక్కలను అందజేసినట్లు తెలిపారు. అలాగే ప్రతి ఇంటికి కూరగాయల కిచెన్ గార్డెన్ కిట్, ఆకు కూరగాయ విత్తనాలు, బెండా, వేప నూనె వేప పిండి అందజేసినట్లు తెలిపారు. అదేవిధంగా పలు విషయాలపై డాక్టర్ శ్రీనివాస్, చంద్రశేఖర్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాల గురువయ్య, రమేశ్, ఏఈవో లింగయ్య తదితరులు ఉన్నారు.

సృజాత్మకతను వెలికితీసేందుకు సైన్స్ ఫెయిర్

మదర్స్ ల్యాప్ పాఠశాలలో విద్యార్థుల ప్రయోగాలను పరిశీలిస్తున్న డీఈవో అబ్దుల్ గని

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 5: విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు సైన్స్ ఫెయిర్‌లో ఎంతగానో ఉపయోగపడతాయని డీఈవో అబ్దుల్ గని అన్నారు. జిల్లా కేంద్రంలోని మదర్స్ ల్యాప్ హైస్కూల్‌లో మూడు రోజుల పాటు కొనసాగిన సైన్స్ ఫెయిర్ బుధవారంతో ముగిసింది. ముగింపు వేడుకలకు డీఈవో అబ్దుల్ గని హాజరై విద్యార్థులు తయారు చేసిన ప్రదర్శనలను తిలకించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అబ్దుల్ ముబిన్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నిరంతర విద్యుత్ సరఫరాకు కృషి చేయాలి

అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న ఎస్ఈ తిరుపతిరావు

గద్వాల అర్బన్, ఫిబ్రవరి 5 : రానున్న వేసవిలో నిరంతం నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు అధికారులు కృషి చేయాలని విద్యుత్ శాఖ ఎస్ఈ తిరుపతి రావు పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎస్ఈ కార్యాలయంలోని తన చాంబర్‌లో మండల విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ జిల్లాలో రూ.50కోట్ల వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. దానిలో భాగంగా నాలుగు కొత్త 33కేవీ ఫీడర్లు, 15కొత్త పవర్ ట్రాన్స్‌ఫార్మర్,15 కొత్త 11 కేవీ ఫీడర్లు, ఓవర్‌లోడ్‌తో ఉన్నా ట్రాన్స్‌ఫార్మర్లను మార్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ రమేశ్‌బాబు, అధికారులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కొత్తకోట, ఫిబ్రవరి 5: లారీ ఢీ కొని వ్యక్తి మృతి చెందిన ఘటన కొత్తకోట పట్టణ జాతీయ రహదారిపై బుధవారం చోటుచేసుకున్నది. ఎస్సై ఆనంద్ కథనం వివరాల ప్రకారం పాన్‌గల్ మండలంలోని రేమద్దుల గ్రామానికి చెందిన ఎట్లు నర్సింహారెడ్డి (44) తన బంధువుల ఇళ్లు అయిన కొత్తకోట మండలం విలియం కొండ గ్రామానికి తన భార్యతో కలిసి వచ్చాడు. సాయంత్రం 4గంటలకు నర్సింహారెడ్డి కొత్తకోటలో పని ఉందని వెళ్లివస్తానని భార్య తో చెప్పి వెళ్లి పోయాడు. పని పూర్తి చేసుకున్న తర్వాత తిరిగి విలియం కొండ గ్రామానికి తన బైక్‌పై వస్తుండగా ఎన్ హెచ్-44 రోడ్డులో కొత్తకోట గ్రామ శివారులో ఉన్న మథర్ థెరిస్సా జంక్షన్ వద్ద హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు కు వెళ్తున్న లారీ వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తలకు, కాళ్ల కు గాయాలు అతడిని అంబులెన్స్‌లో వనపర్తి జిల్లా దవాఖానకు తరలించగా మెరుగైన వైద్యం కోసం క్షతగాత్రుడిని పాలమూరు జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించారు అక్కడ ఉన్న డ్యూటీ డాక్టర్లు అతడిని పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. అతని భార్య అరుణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తమిళనాడు రాష్ట్రానికి చెందిన లారీ డ్రైవర్ విజయ్ మాయాకృష్ణన్‌పై కేసు నమోదు చట్టపర మైన చర్యలు తీసుకుంటామని ఎస్సై ఆనంద్ తెలిపారు.

బీసీలను మోసం చేస్తున్న కాంగ్రెస్

- బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పలుస రమేశ్‌గౌడ్

వనపర్తి, ఫిబ్రవరి 5(నమస్తే తెలంగాణ) : జనాభాలో 50శాతానికిపైగా ఉన్న బీసీలను తక్కువగా ఉన్నట్లు చూపి కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తుందని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పలుస రమేశ్‌గౌడ్ పేర్కొన్నారు. ఎన్నికల్లో 50శాతం సీట్లు కేటాయిస్తామని ఏడాది పొడవునా చెప్పి ఎలాంటి చట్టబద్ధత లేకుండా మరో కుట్రకు కాంగ్రెస్ తెరలేపిందని విమర్శించారు.బుధవారం బీఆర్ఎస్ జిల్లా మీడియా కన్వీనర్ నందిమళ్ల అశోక్, కంచె రవి, గౌడ నాయక్‌లతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. తప్పుడు విధానంతో త్వరగా సర్వే నిర్వహించి 42శాతంగా బీసీలను గుర్తించడం అత్యంత దుర్మార్గమన్నారు. కేవలం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల ఓట్ల కోసం మరో మోసపు నాటకానికి కాంగ్రెస్ ప్రభుత్వం యత్నిస్తున్నదని ఆయన పేర్కొన్నారు. అసెంబ్లీలో చట్టబద్ధత కల్పించకుండానే కేంద్రంపై నెపం నెట్టి బీసీలకు అన్యాయం చేయడానికి వేసిన మరో ఎత్తుగడ తప్పా మరొకటి లేదన్నారు. తప్పుల తడకగా ఉన్న సర్వేను చూపి 42శాతమే బీసీలు అంటూ ఎలా తేలుస్తారని ప్రశ్నించారు. 96శాతం సర్వే జరిగిందని అసలు నిజాలను దాచిపెట్టి అసెంబ్లీని తప్పుదోవ పట్టించారని, కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతున్న సర్వే రిపోర్టులన్నీ బోగస్ అంటూ రమేశ్‌గౌడ్ పేర్కొన్నారు. కామారెడ్డిలో ఇచ్చిన డిక్లరేషన్ ప్రకారం బీసీ జనాభా లెక్క తేల్చి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని, ప్రభుత్వ లెక్కప్రకారం మిగిలిన 20శాతం బీసీ జనాభాను లెక్కించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో రహీం, రాము, తోట శ్రీను, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అయిజలో విలేకరులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వపల్లయ్య



సమావేశంలో మాట్లాడుతున్న పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు పలుస రమేశ్ గౌడ్

తప్పుల తడకగా కులగణన

: బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య

అయిజ, ఫిబ్రవరి 5 : కులగణనతో బీసీలకు కాంగ్రెస్ సర్కార్ తీవ్ర వైఫల్య అన్యాయం చేస్తుందని బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య అన్నారు. బుధవారం అయిజ పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి, బీసీలకు జరుగుతున్న నష్టంపై కాంగ్రెస్ సర్కారును సూటిగా ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ కులగణనను తప్పుల తడకగా చేసి బీసీ జనాభాను తగ్గించే ప్రయత్నం చేసిందని విమర్శించారు. కులగణనలో ఒక వర్గం జనాభా పెరుగడానికి సీఎం రేవంత్‌రెడ్డి కులగణన చేసినట్లు ఉందన్నారు. కులగణన సర్వేలో చోటు చేసుకున్న లోపాలను సరిదిద్దాలని, ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. కేబినేట్ విస్తరణలో నలుగురు బీసీలకు స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ మండల అధ్యక్షుడు మత్తాలి, తిరుమలేశ్, చిన్న రాయుడు పాల్గొన్నారు.

వేరుశనగ రైతుల ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

- కలెక్టర్ ఆదర్శ్ సురభి

చిట్యాలలో వేరుశనగ పంటను పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 5: జిల్లాలో వేరుశనగ రైతుల ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. చిట్యాల సమీపంలో ఉన్న వ్యవసాయ మార్కెట్‌యార్డును బుధవారం ఆయన తనిఖీ చేశారు. వేరుశనగ అమ్మకంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని రైతులను అడిగారు. దానికి రైతులు బదులిస్తూ వేరుశనగ పంటకు మంచి ధర దక్కడం లేదని, తమ పంటలకు మంచి ధర కల్పించి ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. అందుకు కలెక్టర్ స్పందిస్తూ వేరుశనగ రైతుల ఇబ్బందులను, మంచి ధర కల్పించే అంశంపై ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, మార్కెటింగ్ అధికారి స్వరణ్‌సింగ్, ఇతర అధికారులు , రైతులు, ట్రేడర్లు ఉన్నారు.

పటిష్టమైన భద్రతలో ఈవీఎంల గోదాం

జిల్లాలోని ఈవీఎంల గోదాం పటిష్టమైన భద్రత నడుమ ఉందని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదాం నెలవారీ తనిఖీలో భాగంగా అదనపు కలెక్టర్ జి.వెంకటేశ్వర్లుతో కలిసి పరిశీలించారు. గోదాం వద్ద నిత్యం విధులు నిర్వర్తిస్తున్న పోలీసుల వివరాలు ఆయన అడిగి రిజిస్టర్‌ను పరిశీలించారు.

మోడల్ ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పరిశీలన

జిల్లా కేంద్రంలోని జెడ్పీ కార్యాలయ ఆవరణలో నిర్మిస్తున్న ఇందిరమ్మ మోడల్ ఇల్లును బుధవారం కలెక్టర్ ఆదర్శ్ సురభి పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మండలానికి ఒక మోడల్ ఇల్లు నిర్మించాలని సూచించిన నేపథ్యంలో జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న ఇంటిని పరిశీలించినట్లు కలెక్టర్ చెప్పారు. ఇందిరమ్మ మోడల్ ఇల్లును ఎంత విస్తీర్ణంలో నిర్మిస్తున్నారని ప్రశ్నించగా హౌసింగ్ డీఈవో బదులిస్తూ 23*20 విస్తీర్ణంలో, రూ.5లక్షల వ్యయంతో సింగిల్ బెడ్రూం ఇల్లు నిర్మిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో యాదయ్య, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, జెడ్పీ డిప్యూటీ సీఈవో రామ మహేశ్వర్, హౌసింగ్ డీఈ విటోబా , తాసీల్దార్ రమేశ్‌రెడ్డి, ఇతర సిబ్బంది ఉన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

కృష్ణ (ఫైల్)

వడ్డేపల్లి, ఫిబ్రవరి 5 : విద్యుదాఘాతంతో యువకుడి మృతి చెందిన ఘటన మండలంలోని రామాపురం గ్రామంలో చోటు చేసుకున్నది. స్థానికుల కథనం ప్రకారం ప్రైవేట్‌గా కరెంట్ పనులు చేసే రామాపురం, కొంకల గ్రామానికి చెందిన ఎనిమిది మంది యువకులను శివరాత్రి మహోత్సవాల్లో భాగంగా శ్రీశైలం దేవస్థానం వారు చేపట్టిన పనులు చేయడానికి కాంట్రాక్టర్ తీసుకెళ్లారు. బుధవారం ఉదయం ఆలయ సమీపంలో పనులు చేసే నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేసు కొని పనులు చేపట్టారు. స్తంభంపైకి ఎక్కిన రామాపురం గ్రామానికి చెందిన బోయ ఆంజనేయులు కుమారుడు కృష్ణ(25)కు విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. ఆలయం వారు జనరేటర్ ఆన్‌చేసి ఉండటం వల్ల షాక్ వచ్చిందని, ఆలయం వారికి చెప్పి ఆఫ్ చేసే లోపే యువకుడు స్థంభం మీదే మృతి చెందాడని తెలిపారు. మృతుడికి భార్య పావని, పాప, నెల రోజుల కిందటే పుట్టినబాబు ఉన్నారని తెలిపారు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు, గ్రామస్తులు శ్రీశైలానికి వెళ్లారు. దేవస్థానం వారు బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

యువకుడిపై హత్యాయత్నం

- కత్తిపోట్లకు గురైన యువకుడు

అయిజ, ఫిబ్రవరి 5 : భార్యతో సన్నిహితంగా ఉంటున్నాడనే అనుమానంతో ఓ వ్యక్తి యువకుడిపై కత్తితో దాడి చేసి గాయపర్చిన ఘటన అయిజ పట్టణంలో చోటు చేసుకున్నది. ఎస్సై శ్రీనివాసారావు కథనం మేరకు పట్టణానికి చెందిన నేష రాజేశ్వరి, తిమ్మారెడ్డి దంపతుల కుమారుడు మాస్ అనే యువకుడు ఇంటి సమీపంలోనే నివాసం ఉంటున్న గూడు బాషా భార్యతో సన్నిహితంగా ఉంటున్నాడని అనుమానంతో వారం రోజుల కిందట మాస్‌ను హెచ్చరించాడు. అయినప్పటికీ మాస్ పట్టించుకోకుండా అలాగే భార్యతో సన్నిహితంగా ఉన్నాడనే నెపంతో బుధవారం మాస్ ఇంట్లో ఎవరూ లేని విషయం తెలుసుకుని ఇంట్లోకి చొరబడి యువకుడిపై కత్తితో దాడి చేశాడు. దీంతో మాస్‌కు గాయాలుకాగా బాధితుడిని పట్టణంలోని ప్రైవేట్ దవాఖానకు తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. మెరుగైన చికిత్స కోసం గద్వాల ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు ఎస్సై తెలిపారు. తల్లి రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మోటర్ల దుకాణంలో చోరీ

వడ్డేపల్లి, ఫిబ్రవరి 5 : మోటర్ల దుకాణంలో చోరీ జరిగిన ఘటన మంగళవారం అర్ధరాత్రి మండలంలోని జూలేకల్ స్టేజీలోని చోటుచేసుకున్నది. ఏఎస్సై బాషా కథనం ప్రకారం వెంకట్రామనగర్‌కు చెందిన వెంకటేశ్ జూలేకల్ స్టేజీలో వద్దవెంకటేశ్వర ఇంజినీరింగ్ వర్క్ షాపు రేకుల షెడ్డులో నడుపుతున్నాడు. షాపులో మోటర్ల స్పేర్‌పార్ట్స్, వైండింగ్ వైరు తదితర పరికరాలు విక్రయిస్తుంటాడు. ఎప్పటిలాగే దుకాణం మూసివేసి ఇంటికి వెళ్లాడు. అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు షాపు వెనుక రేకులు కోసి షాపులో చొరబడి కొత్త, పాత వైండింగ్ వైరును దొంగలించుకొని వెళ్లారు. శాంతినగర్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఏఎస్సై బాషా విచారణ చేపట్టాడు. సీఐ టాటాబాబు సూచనల మేరకు క్లూస్ టీంతో ఆధారాలు సేకరించారు. సమీపంలోని సీసీ ఫుటేజీలను పరిశీలించి దొంగతనానికి దొంగలు ఆటోలో వచ్చినట్లుగా గుర్తించామని, పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది నబీ రసూల్, స్వామి రాజు, అల్లిబాబు, మస్తాన్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి

- గద్వాల సర్కిల్ సీఐ శ్రీను

గద్వాల అర్బన్, ఫిబ్రవరి 5 : సాంకేతిక పరిజ్ఞానంతో కొత్త కొత్త మార్గాల్లో జరుగుతున్న సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని గద్వాల సర్కిల్ సీఐ శ్రీను పేర్కొన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు సైబర్ జాగృతి దివాస్ పురస్కరించుకొని బుధవారం జిల్లా కేంద్రంలోని డిగ్రీ కాలేజీ విద్యార్థులతో ఎస్‌పీఎం డిగ్రీ కాలేజీ నుంచి కృష్ణవేణి చౌక్ వరకు ర్యాలీ నిర్వహించి సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీను మాట్లాడుతూ కొత్త కొత్త సాంకేతిక పరిజ్ఞానంతో జరుగుతున్న సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలన్నారు. డబ్బులు పోయాక బాధపడటం కంటే అవగాహనతో వ్యవహరించి జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో గద్వాల టౌన్ ఎస్సై కళ్యాణ్ కుమార్ ఉన్నారు.

విద్యార్థులు ఉన్నత ఉద్యోగాలు సాధించాలి

- ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 5 : విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత ఉద్యోగాలను సాధించాలని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. జిల్లాకేంద్రంలోని చాణక్య స్కూల్ యాజమాన్యం విన్నపం మేరకు బుధవారం పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి విద్యార్థులకు ఉన్న సందేహాలను నివృత్తం చేయడంతో పాటు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విద్యార్థుల జీవితంలో ఉన్నత విజయాలను అందుకోవడానికి గొప్ప గొప్ప విజయాలు సాధించిన వారి చరిత్రలను, వారికి సంబంధించిన బుక్స్‌ను చదవడం అలవర్చుకోవాలని, విద్యార్థిగా ఎదిగే క్రమంలో తోటి స్నేహితులను మంచి వారిని ఎంపిక చేసుకోవాలన్నారు. సబ్జెక్టులో వచ్చే తక్కువ మార్కులను చూపి నిరాశ చెందవద్దని, నిరాశ చెందడం వల్ల సమయం వృథా అవ్వడంతోపాటు మానసికంగా బాధను కలుగజేస్తుందన్నారు. ఎన్నో పెయిల్యూర్ తర్వాత సక్సెస్ వస్తుందని, అందుకని లక్ష్యాన్ని చేరే క్రమంలో ఎన్నో ఓటములు చెందిన ప్రయత్నం చేయడం ఆపవద్దని సూచించారు. విద్యార్థులు ప్రతిరోజు ఫిజికల్ యాక్టివిటీస్ చేయాలని తద్వారా ఫిజికల్‌గా స్ట్రాంగ్‌గా అవుతారని, అందుకు రోజు గేమ్స్ ఆడడం, రన్నింగ్ చేయడం అలవర్చుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయొద్దని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఎస్‌వో చెన్నమ్మ థామస్, ప్రిన్సిపాల్ సాజుపాల్, హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జీతాలు చెల్లించాలంటూ దవాఖాన వర్కర్ల నిరసన

దవాఖాన ఎదుట బైఠాయించి నిరసన చేస్తున్న దవాఖాన కాంట్రాక్ట్ వర్కర్లు

ఆత్మకూరు, ఫిబ్రవరి 5: తొమ్మిది నెలలుగా జీతాలు రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆత్మకూరు సర్కారు దవాఖానలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ వర్కర్స్ ఆవేదన వెలిబుచ్చారు. బుధవారం దవాఖానలోని 14మంది కాంట్రాక్ట్ వర్కర్లు ఏఐటీయూసీ కార్మిక సంఘం ఆధ్వర్యంలో దవాఖాన ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తంచేశారు. వెంటనే తమ జీతాలు ఇవ్వాలంటూ డిమాండ్‌చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు జిల్లా నాయకులు శ్రీహరి మాట్లాడుతూ జీతాలు ఇవ్వకుండా కాంట్రాక్ట్ వర్కర్లతో వెట్టిచాకిరీ చేయిస్తున్నారని విమర్శించారు. అదేవిధంగా పీఎఫ్, ఈఎస్ఐ డబ్బులు కూడా జమ కావడం లేదంటూ ఆరోపించారు. వీరికి హెల్త్‌కార్డులు అందించి దవాఖాన నుంచి గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వర్కర్లను వేధింపులకు గురిచేస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని, వెంటనే వేతనాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో దవాఖాన సంఘం ప్రతినిధులు బాలరాజు, పార్వతమ్మ, నాగమ్మ, శైలజ, బాలకిష్టమ్మ, మణెమ్మ పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలి

- బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి అరవింద్ స్వామి

ఆర్డీవో కార్యాలయ ఎదుట నిరసన చేస్తున్న బీసీ విద్యార్థి సంఘం నేతలు

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 5 : పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి అరవింద్ స్వామి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయాన్ని సంఘం నేతలు, విద్యార్థులతో కలిసి ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు సంబంధించిన స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్ మొత్తం బకాయిలు రూ.5,800కోట్లు తక్షణమే ప్రభుత్వం విడుదల చేయాలన్నారు. ఉన్నత చదువులు చదివిన స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్ మెయింట్ రాకపోవడంతో సర్టిఫికెట్లు కళాశాలల్లోనే మగ్గిపోతున్నాయని, డబ్బులు చెల్లించే స్థోమత లేక ఆపై చదువులు చదవలేక ఎన్నో ఇబ్బందులకు పేదవిద్యార్థులు గురవుతున్నారన్నారు. విద్యార్థుల సమస్యలపై బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఆర్డీవో కార్యాలయ ముట్టడి చేపట్టినట్లు ఆయన చెప్పారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీవో కార్యాలయ అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో బీసీ సంఘం నేతలు చిట్యాల రాము, లోకేశ్‌యాదవ్, చక్రి, షఫీ, చరణ్, రాకేష్, నాగేంద్రం పాల్గొన్నారు.

బండలాగుడు పోటీల్లో పాల్గొన్న వృషభరాజములు

జోరుగా..హుషారుగా..

- బండలాగుడు, బాస్కెట్‌బాల్ పోటీలు

అయిజ, ఫిబ్రవరి 5 : మండలంలోని ఉత్తనూరు గ్రామంలో ధన్వంతరి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న అంతర్రాష్ట్ర బండలాగుడు పోటీలను బుధవారం మంత్రాలయం ఎమ్మెల్యే బాల నాగిరెడ్డి ప్రారంభించారు. తెలంగాణ, కర్ణాటక, ఆంధ్ర రాష్ట్రాల నుంచి తరలొచ్చిన 10 జతల వృషభరాజ ములు బండలాగుడు పోటీలు జోరుగా.. హుషారుగా జరగడంతో రైతులు తండోపతండాలుగా తరలివచ్చారు. విజేతలుగా నిలిచిన వృషభరాజముల యజమానులకు ఆలయ కమిటీ నగదు బహుమతులను అందజేసింది. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గౌరు వెంకట్‌రెడ్డి, బ్రహ్మోత్సవాల మహాదాత పులకుర్తి శ్రీనా రెడ్డి, భీంరెడ్డి, పురుషోత్తమ్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, గౌతమ్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

హోరాహోరీగా..

ఎన్టీఆర్ మినీ స్టేడియంలో జరుగుతున్న బాస్కెట్‌బాల్ టోర్నీలో భాగంగా క్వార్టర్ ఫైనల్ పోటీల్లో తెలంగాణ, ఏపీ జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. ఉత్తనూర్ ధన్వంతరి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న బాస్కెట్‌బాల్ టోర్నీలో బుధవారం క్వార్టర్ ఫైనల్ పో